క్లుప్తంగా

ఎరుకుమాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి భక్తులు స్వహస్తాలతో జలాభిషేకం చేశారు. ముందుగా కార్యనిర్వహణాధికారి రామాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని పసుపుతో అలంకరించి, హారతులు ఇచ్చారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులకు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేట్'లో 25 శాతం సీట్లపై 5న అవగాహన సదస్సు

మద్దిలపాలెం: పేద విద్యార్థులకు ప్రైవేట్ స్కూళ్లలో 25 శాతం సీట్లు మొదటి తరగతిలో ప్రవేశాలు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.24పై ఈ నెల 5న అవగాహన సదస్సు నిర్వహించనున్నామని రైట్ టూ ఎడ్యుకేషన్ ఫోరం ప్రతినిధి నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా హక్కు చట్టంలో భాగంగా కేటాయించనున్న 25 శాతం సీట్లపై తల్లిదండ్రులకు పలు సూచనలు, సలహాలు ఇవ్వనున్నామన్నారు. బుల్లయ్య కళాశాల గాంధీ సెంటర్‌లో ఉదయం 10 గంటలకు ఈ సదస్సు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

రూ.10కే భోజనానికి విశేష స్పందన



భోజనం అందజేస్తున్న సంస్థ సభ్యులు

దాబాగార్డెన్స్: వాల్తేర్ రాయల్ రౌండ్ టేబుల్, వివేకానంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఘోషాస్పత్రి వద్ద ఏర్పాటు చేసిన రూ.10కే భోజన కార్యక్రమానికి పేషెంట్ల సహాయకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. 15 రోజులుగా నిర్విరామంగా రోగుల సహాయకులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో రౌండ్ టేబుల్ సభ్యులు సందీప్‌రెడ్డి, మక్సూద్ అహ్మద్, డాక్టర్ జైబీ, వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, తాతబ్బాయి, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసి పూజ

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం సహస్ర తులసి పూజ జరిపించనున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. ప్రతీ గురువారం ఉదయం 8 నుంచి 9 వరకు జరిపించే ఈ పూజలో పాల్గొనాలనుకునే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చన్నారు. వివరాలకు ఆలయ ప్రతినిధులను సంప్రదించాలని సూచించారు.

సంఘ సేవకుడు అగర్వాల్‌కు నివాళి



డీఎస్ అగర్వాల్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సంస్థ సభ్యులు

దాబాగార్డెన్స్: ప్రముఖ సంఘ సేవకుడు, స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యుడు డీఎస్ అగర్వాల్ అనారోగ్యంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఈ సందర్భంగా సంస్థ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. అగర్వాల్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు మాట్లాడుతూ సంస్థకు అగర్వాల్ అహర్నిశలు అండగా ఉండేవారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దానయ్య, తాతబ్బాయి, ఈశ్వరరావు, నాగమణి, సుజాత, రత్న, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అల్లరి మూకలకు అడ్డుకట్ట ఏదీ?

- మద్యం సేవించి దాడులకు దిగుతున్న వైనం
- ప్రశ్నించిన వారిపై జులుం
- భయాందోళనల్లో సామాన్య జనం



అల్లరిమూకల దాడిలో గాయపడ్డ యువకుడు (ఫైల్)




గత నెలలో అల్లరిమూకల దాడిలో తీవ్రంగా గాయపడ్డ కుండేటి సుధాకర్ (ఫైల్)

దాబాగార్డెన్స్: వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అల్లరి మూకల దౌర్జన్యాలు మితిమీరిపోతున్నాయి. మద్యం సేవించి స్థానికులను భయాందోళనలకు గురి చేస్తున్నారు. ఇప్పటికే వారి బారిన పడి పలువురు ఆసుపత్రి పాలయ్యారు. మద్యం మత్తులో ఏం చేస్తున్నారో వారికే తెలియడం లేదు. ఈ విషయమై పోలీసులు శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వారు తూతూ మంత్రంగా వ్యవహరిస్తుండడంతో అల్లరిమూకలు రెచ్చిపోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

రౌడీ మూకల దాడిలో గత నెలలో 36వ వార్డుకు చెందిన కుండేటి సుధాకర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఇదిలా ఉండగా ఇటీవల ఓ కుటుంబం శుభకార్యానికి వెళ్లి ఇంటికి వస్తుండగా రంగిరీజువీధిలో కొంత మంది అల్లరిమూకలు ఆ కుటుంబ సభ్యులపై దాడికి దిగారు. మహిళ దుస్తులు చించేశారు. ప్రశ్నించినందుకు ఆ మహిళ సోదరుడిపై తీవ్రంగా దాడి చేశారు. ద్విచక్ర వాహనాలపై మితిమీరిన వేగంతో ర్యాష్ డ్రైవ్ చేయడం, అటుగా వెళ్లే వారిపై దాడులకు దిగుతుండడంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ విషయమై ప్రశ్నించిన వారిపై 'ఇది నా ఏరియా.. నువ్వెవడివి అడగడానికి?' అంటూ వీరంగం సృష్టిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. పోలీసులకు ఈ విషయం చెబితే కొడతామని బెదిరిస్తున్నారని, రాళ్లతో దాడులకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన దాడికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులను బాధితులు ఆశ్రయించారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి అల్లరిమూకల ఆగడాలు కట్టడి చేయాలంటూ కోరుతున్నారు.

బెంబేలెత్తుతున్న మహిళలు..

అల్లరి మూకల ఆగడాలు పెచ్చుమీరుతుండడంతో మహిళలు బెంబేలెత్తుతున్నారు. దుకాణాలు, మాల్స్, ప్రైవేట్ సంస్థల్లో పని చేసే మహిళలు దుకాణాలు కట్టేసిన తర్వాత ఇళ్లకు వస్తున్నప్పుడు, అలాగే రాత్రివేళల్లో ఒంటరిగా వెళ్తున్న సమయంలో మహిళలపై మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారని, ఈ విషయం బయటికి చెప్పలేక.. పోలీసులకు ఫిర్యాదు చేయలేక మిన్నకుండిపోతున్నామంటూ పలువురు మహిళలు 'సాక్షి' దృష్టికి తీసుకొచ్చారు. ఒకవేళ పోలీసులకు ఫిర్యాదు చేస్తే రౌడీమూకలు తమపై దాడులకు దిగేందుకు వెనుకాడటం లేదని వారు వాపోతున్నారు.



ఆకతాయిలు, అల్లరిమూకలకు అడ్డాగా ఉన్న ఘాట్ రోడ్డు

ఘాట్‌రోడ్డులో మితిమీరుతున్న అల్లరిమూకలు

ఇదిలా ఉండగా కొన్నాళ్ల కిందట సత్యనారాయణ స్వామి ఘాట్‌రోడ్డులో పలువురు మద్యం సేవించి పోలీసులపై కూడా దాడికి దిగినట్టు 'సాక్షి' దృష్టికి వచ్చింది. సాయంత్రం 4 గంటల నుంచి అర్ధరాత్రి వరకు మద్యం సేవిస్తూ ఈ రోడ్డులో హల్‌చల్ చేస్తున్నారంటూ స్థానికులు వాపోతున్నారు. వీరి ఆగడాలకు అడ్డుకట్ట వేయడంలో పోలీసులు విఫలమయ్యారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ మూకలు బయటి వారిపై దాడులకు దిగడమే కాకుండా మద్యం మత్తులో వారిలో వారే ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటున్నారని చెబుతున్నారు.

లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ



వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న రంధి గోపీకృష్ణ, వలంటీర్ తదితరులు



డయాలసిస్ పేషెంట్ భానుచందర్‌కు పింఛన్ అందజేస్తున్న పాల శ్రీహరిరెడ్డి, వలంటీర్

అల్లిపురం: లబ్ధిదారులకు బుధవారం సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. జీవీఎంసీ 33వ వార్డులో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేశారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ, సచివాలయం కన్వీనర్ల ఇన్‌చార్జి కర్రి నీలకంఠం, కన్వీనర్లు పాల్గొన్నారు.

డయాలసిస్ పేషెంట్‌కు..

కుమ్మరవీధి సచివాలయం పరిధిలో డయాలసిస్ పేషెంట్ ముత్యాల భానుచందర్‌కు రూ.10 వేలు పింఛన్‌ను అందజేశారు. టెలికాం అడ్వయిజరీ కమిటీ సభ్యుడు పాల శ్రీహరిరెడ్డి, వలంటీర్లు గుణ, కిరణ్మయి, భవానీ పాల్గొన్నారు.

పారిశ్రామిక రంగంలో రాష్ట్రం అగ్రస్థానమే సీఎం లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి

దాబాగార్డెన్స్: రాష్ట్రాన్ని పారిశ్రామిక రంగంలో అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని, అందుకు విశాఖలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్-2023 నిదర్శనమని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా అవతరించబోతున్న విశాఖ నగరంలో జరిగే గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు విచ్చేస్తున్న వ్యాపారవేత్తలకు ఆతిథ్యం ఇవ్వడానికి ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ సమ్మిట్‌ను విజయవంతం చేయాలని కోరారు. పెట్టుబడులు రావడం లేదని, కంపెనీలు వెళ్లిపోతున్నాయని ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శల్లో నిజం లేదన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితి లో దేశంలో ఎక్కడా లేని విధంగా జీడీపీలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉండటే ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గొప్పతనమని కొనియాడారు. ఈ సమావేశంలో కనకమహాలక్ష్మి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, కార్పొరేటర్లు అల్ల లీలావతి, విల్లూరి భాస్కరరావు, పార్టీ నాయకులు కోడిగుడ్ల శ్రీధర్, మాసిపోగు రాజు, దొడ్డి రామానంద్, కర్రి నీలకంఠం, సబీరా బేగం, మాదాబత్తుల రమేష్, బోని దేవా, వేగి వెంకట అప్పారావు, బొడ్డేటి కిషోర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు విస్తృత ప్రచారం



పట్టభద్రులకు కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి



ఉపాధ్యాయురాలిని ఓటు అభ్యర్థిస్తున్న కార్పొరేటర్ చెన్నా జానకీరామ్

కంచరపాలెం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధిలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచారంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను కోరారు. జోన్-5 కార్యాలయం, సచివాలయాలు, వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం, జ్యోతినిలయం ప్రాంతాల్లో ప్రచారం సాగింది. కార్యక్రమంలో పార్టీ నాయకులు మైఖేల్‌రాజు, వి.వేళంగిణిరావు, శ్రీను, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

29వ వార్డులో..

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 29వ వార్డులో కార్పొరేటర్ ఉరికిటి నారాయణరావు విస్తృత ప్రచారం చేశారు. పట్టభద్రులను కలిసి, వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు ఓటు వేయాలని కోరారు. కరపత్రాలు పంపిణీ చేసి, వాల్ స్టిక్కర్స్ అంటించారు. కార్యక్రమంలో వార్డు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

37వ వార్డులో..

సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ జీవీఎంసీ 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ ఆధ్వర్యంలో జోరుగా ప్రచారం చేశారు. అర్హులైన ఓటర్లకు ఓటర్ స్లిప్పులు అందజేశారు. డోర్ టు డోర్ కార్యక్రమంలో స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు యేసు, కాసారపు వాసు, రెయ్యి డేవిడ్‌రాజు, గోపి, ఆనంద్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

34వ వార్డులో..

అల్లిపురం: వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. లక్ష్మీదేవిపేట, అంబేడ్కర్ కాలనీ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, వార్డు సీనియర్ నాయకుడు లండా రమణ, తాతబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఎల్లమ్మ జాతర



అమ్మవారిని తోడ్కొని వెళ్తున్న భక్తులు



జాతరలో జన సందోహం

దాబాగార్డెన్స్: జగదాంబ జంక్షన్ వద్ద కొలువుదీరిన ఎల్లమ్మవారి జాతర బుధవారం వైభవంగా జరిగింది. ఆలయం వద్ద అమ్మవారి దర్శనం కోసం వేకువజాము నుంచి భక్తులు బారులు తీరారు. అమ్మవారితో పాటు ఆమె సోదరుడు పోతురాజుకు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు, దేవదాయ శాఖ అధికారులు దర్శించుకున్నారు. ఎల్లమ్మతోట, చాకలిపేట, కనకలవీధి, కుమ్మరవీధి, దిబ్బలపాలెం, ప్రకాశరావుపేట, మహారాణిపేట, అంగటిదిబ్బ, దాబాగార్డెన్స్, సూర్యాబాగ్, బొడ్డునాయుడు తోట, లలితానగర్ తదితర ప్రాంతాలతో పాటు విజయనగరం, శ్రీకాకుళం, భీమిలి, కొత్తవలస తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. జాతర సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. రాత్రికి ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వేంకటేశ్వర థియేటర్ సమీపంలో ఉన్న ఎల్లమ్మతల్లి పుట్ట వద్ద మాలధారులు శూలాల ప్రదర్శన చేపట్టారు. అగ్నిగుండం తొక్కారు. టూటౌన్, మహారాణిపేట పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కె.పద్మావతి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

తొలేళ్లతో ప్రారంభం : మహాశివరాత్రి తర్వాత తొమ్మిదో రోజు మృగశిర నక్షత్రాన అమ్మవారి జాతర నిర్వహించడం ఆనవాయితీ. అమ్మవారి జాతర ముందు రోజున(మంగళవారం) అర్ధరాత్రి దాటిన తర్వాత వన్‌టౌన్ జిల్లెలమూడు వీధిలోని జొన్నాడ గురుమూర్తి ఇంట్లో ఉన్న చదునుపట్టు వద్ద ఎల్లమ్మ అమ్మవారు, సోదరుడు పోతురాజుకు పప్పు, బియ్యం, ఉలవలతో ఉపారం పెట్టి అక్కడి నుంచి మేళతాళాలతో అమ్మవారిని తోడ్కొని వచ్చారు.

నిరాశ్రయులకు అన్నదానం



వృద్ధులకు భోజనాలు వడ్డిస్తున్న కోన శంకర్ కుటుంబ సభ్యులు

దాబాగార్డెన్స్: సంఘ సేవకుడు కోన వీరాస్వామి వర్ధంతి సందర్భంగా 30వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు, కేవీఎస్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కోన శంకర్ ఆధ్వర్యంలో పెదవాల్తేర్‌లోని రెడ్‌క్రాస్ సొసైటీ నిరాశ్రయుల ఆశ్రమ వృద్ధులకు బుధవారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కోన ప్రకాష్, సన్యాసమ్మ, కృప, అప్పలకొండ, వెంకటరత్నం, కోడూరు రూప, రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజర్ మురళీ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ చైతన్య మహాప్రభు జయంత్యుత్సవాలు ప్రారంభం



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

దాబాగార్డెన్స్: జిల్లా పరిషత్ కార్యాలయ సమీపంలోని శ్రీకృష్ణ చైతన్య మఠం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ చైతన్య మహాప్రభు జయంత్యుత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా సాయంత్రం 4 గంటలకు శ్రీకృష్ణ చైతన్య మఠం నుంచి ఆర్కే బీచ్ వరకు శోభాయాత్ర నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు విశేష హారతి, నీరాజనం, మంత్ర పుష్పాలు, తీర్థ ప్రసాద గోష్టి జరిపారు. గురువారం ఉదయం 8 గంటలకు మహాసంకల్పం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాసూత్రధారణ, అంకురార్పణ, మండపారాధన, విశేష హోమాలు, సాయంత్రం 5 గంటల నుంచి నామ సంకీర్తనాలు నిర్వహించనున్నారు.

ఆర్‌జేడీగా మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌కు బాధ్యతలు



డాక్టర్ శోభారాణిని అభినందిస్తున్న అధ్యాపకులు, సిబ్బంది

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి జోన్-1 రీజనల్ జాయింట్ డైరెక్టర్(ఆర్‌జేడీ)గా పూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది బుధవారం ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

రైల్వే ట్రాక్‌పై వ్యక్తి ఆత్మహత్యాయత్నం



మేహాద్రి గెడ్డ రిజర్వాయర్ వద్ద రైల్వే ట్రాక్ మీద ఆత్మహత్యాయత్నంచేసిన వ్యక్తి

మహారాణిపేట: మేహాద్రి గెడ్డ రిజర్వాయర్ సమీపంలో రైల్వేట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశాడు. బుధవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనలో ఆయన కుడి చేయి తెగిపడింది. 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించారు. క్షతగాత్రుడి వయస్సు 45 ఏళ్లు ఉండ వచ్చునని 108 వాహన సిబ్బంది తెలిపారు.

నిరంతర అధ్యయనంతో మెరుగైన ఫలితాలు

ఏయూ క్యాంపస్: నిరంతర అభ్యసనం, అధ్యయనంతో మెరుగైన ఫలితాలు సాధించవచ్చునని రిటైర్డ్ డీజీపీ ఎన్.సాంబశివరావు అన్నారు. ఏయూ అర్థశాస్త్ర విభాగ సమావేశ మందిరంలో బుధవారం ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఒక నిర్దిష్టమైన అంశంపై లోతైన అవగాహన కలగాలంటే ముందుగా పలుమార్లు దానిని చదవాలన్నారు. తద్వారా అర్థం చేసుకుని, అవగాహన పెంచుకోవడానికి వీలవుతుందన్నారు. ముఖ్యమైన అంశాలపై నోట్స్ తయారీ, సివిల్ సర్వీస్ పరీక్షలకు సిద్ధం కావడంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, పరీక్షకు సన్నాహం, చదవాల్సిన పుస్తకాలపై ఆయన అవగాహన కల్పించా రు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య డి.పుల్లారావు, విభాగ ఆచార్యులు జి.నాగరాజు, డాక్టర్ బి.లిల్లీ గ్రేస్, డాక్టర్ డి.ఆశాలత, డాక్టర్ వి.వి.ఎస్.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

3న ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రంలో ఈ నెల 3న ఉచిత ఆయుర్వేద వైద్య చికిత్స శిబిరాన్ని నిర్వహించనున్నట్టు కేంద్రం విభాగాధిపతి డాక్టర్ కె.రమేష్‌బాబు తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు బీచ్‌రోడ్డులోని యోగా కేంద్రంలో ఈ శిబిరం జరుగుతుందన్నారు. విశ్రాంత ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ కె.ఈశ్వరరావు రోగులను పరీక్షించి తగిన చికిత్స విధానాలను సూచిస్తారన్నారు. దీర్ఘకాలిక రోగులు తమ మెడికల్ రిపోర్టులను తీసుకురావాలని సూచించారు. పూర్తి వివరాలకు 94944 01919, 93980 19922 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ మీట్‌లో పాల్గొని ప్రతిభ చూపిన ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం విద్యార్థులను వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి బుధవారం తన కార్యాలయంలో అభినందించారు. తమిళనాడులోని మధురై నగరంలోని త్యాగరాజన్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో జరిగిన యుక్తి 23 మేనేజ్‌మెంట్ మీట్‌లో పాల్గొన్న ఎంబీఏ విద్యార్థులు ఎం.స్వర్ణలత, కె.వి.వైష్ణవి, కె.ఆశిష్, ఎస్.భరత్‌కుమార్‌లు వివిధ పోటీలలో విజయం సాధించడంపై వీసీ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, మాజీ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, డాక్టర్ ఎస్.రంజిత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలి



నిరసన తెలుపుతున్న దళిత సేన నేతలు

కంచరపాలెం: సీనియర్ మెడికో వేధింపులకు బలైన వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీ విద్యార్థిని ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు కోరారు. ఆమె ఆత్మహత్యకు కారణమైన నిందితుడు సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై బుధవారం ఊర్వశి జంక్షన్‌లోని దళిత సేన కార్యాలయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీ కులానికి చెందిన ప్రీతిని ర్యాగింగ్ చేసి చిత్రహింసలకు గురిచేయడంతో ఆత్మహత్యకు పాల్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం బాధిత కుటుంబానికి న్యాయం చేసి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో దళిత సేన నగర ఉపాధ్యక్షుడు తాటిపూడి సీతారాం, ప్రధాన కార్యదర్శి మల్లికార్జునరావు, నగర కన్వీనర్ గొల్లమాల మీనా, కార్యదర్శి పట్నాల రూన్సీ తదితరులు పాల్గొన్నారు.

విశ్వజనీనత ప్రతిబింబించేలా కవిత్వం

సీతంపేట: కవులందరూ కవిత్వ తత్వాన్ని అలవర్చుకోవాలని గజల్ గాయని జ్యోతిర్మయి మళ్ల అన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రిజమ్ కళాశాలలో నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనసులను కదిలించే ప్రేమ, జాలి, కరుణ, కళాత్మకత రంగరించి విశ్వజనీనత ప్రతిబింబించేలా కవిత్వం ఉండాలని సూచించారు. పలు గజల్స్ పాడి వినిపించారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కవిత్వాన్ని వివిధ పద్ధతుల్లో వ్యక్తీకరించవచ్చని, అందులో పద్యం, వచన కవిత, లఘు కవితా రీతులైన నానీలు, హైకూలు, రెక్కలు మొదలైన ప్రక్రియలే కాకుండా పారశీక ప్రక్రియ గజల్స్ బాగా ప్రాచుర్యం పొందాయన్నారు. అటువంటి గజల్స్ ప్రక్రియలో రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ బాగా పేరొందిన కవయిత్రి గజల్ గాయని జ్యోతిర్మయి మళ్ల అని కొనియాడారు. రచయిత కె.జి.వేణు మాట్లాడుతూ ఇటీవల మరణించిన గజల్ కవయిత్రి బైరి ఇందిర గురించి, ఆమె కవిత్వంలోని విశేషాలను వివరించారు. సాహితీవేత్తలు, రచయితలు కె.వి.ఎస్.మూర్తి, డి.వి.సూర్యారావు, పి.ఎల్.వి.ప్రసాద్, చిన సూర్యనారాయణ, రామతాత, రమణకొత్తూరి కవితలు వినిపించారు.